క్లుప్తంగా

ఆర్థిక చేయూత

రాజంపేట: ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వీఆర్ఏ ఎడ్ల నీరడి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబానికి అండగా నిలవాలని తహసీల్దార్ టి.శాంత ఆదేశాల మేరకు శుక్రవారం బాధిత కుటుంబానికి ఆర్ఐ సంతోష్ చేతుల మీదుగా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. వీఆర్ఏలు బోయిని రవి, పందుల నర్సింలు, శ్రీకాంత్, స్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి..

భిక్కనూరు: తిప్పాపూర్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నిరుపేద మహిళ శ్యామర్తి ఎల్లవ్వ కుటుంబానికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ రూ.5 వేల ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ వంగేటి చిన్న నర్సారెడ్డి నగదును మహిళ కుటుంబీకులకు అందజేశారు. సర్పంచ్ స్వామి, ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి, విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శేఖర్

బాన్సువాడ రూరల్: బీజేపీ బాన్సువాడ గ్రామీణ మండల అధ్యక్షుడిగా హన్మాజీపేట్ గ్రామానికి చెందిన వడ్ల శేఖర్ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు మాల్యాద్రిరెడ్డి, కొత్తకొండ భాస్కర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను నిర్వర్తిస్తూ, పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని వడ్ల శేఖర్ అన్నారు. కార్యకర్తలు, అభిమానులు వడ్ల శేఖర్‌ను పూలమాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

భిక్కనూరు ఎస్సైగా సాయికుమార్

భిక్కనూరు: మండల ఎస్సైగా సాయికుమార్‌ను నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇంతకు ముందు ఎస్సైగా పనిచేసిన ఆనంద్‌గౌడ్, మెదక్ జిల్లా ఘన్‌పూర్ ఎస్సైగా బదిలీ అయ్యారు. బీబీపేట ఎస్సైగా పనిచేస్తున్న సాయికుమార్‌ను భిక్కనూరుకు బదిలీపై వచ్చారు.

దోమకొండ ఎస్సైగా మురళి

దోమకొండ: దోమకొండ ఎస్సైగా మురళి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సిద్దిపేట నుంచి బదిలీపై దోమకొండకు వచ్చారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన సుధాకర్ రామారెడ్డి ఎస్సైగా బదిలీ అయ్యారు. మురళికి సిబ్బంది స్వాగతం పలికి సుధాకర్‌కు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.

కొనసాగుతున్న ఎంపీటీసీ దీక్ష

ఎల్లారెడ్డి: పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో అన్నాసాగర్ ఎంపీటీసీ ఉమాదేవి శుక్రవారం రెండో రోజు రిలే నిరాహార దీక్ష చేశారు. తన ఎంపీటీసీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దీక్షను కొనసాగించారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు రిలే నిరాహార దీక్ష చేస్తానని ఎంపీటీసీ అన్నారు.

ఈవీఎంలపై అవగాహన

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): భిక్కనూర్, సోమర్యాగడితాండా,శివాపూర్ గ్రామాలలో ఈవీఎం, వీవీప్యాట్‌లపై ఎంపీవో ప్రకాష్ అవగాహన కల్పించారు. ఓటు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీకాంత్, గ్రామస్తులు ఉన్నారు.

చిల్డ్రన్ పార్కు పనుల పరిశీలన

ఎల్లారెడ్డి: పట్టణంలో జరుగుతున్న చిల్డ్రన్ పార్కు పనులను మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. మున్సిపల్ కమీషనర్ జగ్జీవన్, బీఆర్ఎస్ నాయకులు దామోదర్, అరవింద్ తదితరులున్నారు.

పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని రుద్రారం, ఎల్లారెడ్డి పట్టణంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో వైద్య శిబిరాలను నిర్వహించినట్లు మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శరత్ తెలిపారు. అలాగే మందులను అందించినట్లు చెప్పారు. భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బాన్సువాడ రూరల్: భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం కల్గకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు దొడ్ల వెంకట్రాంరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన నాగారంలో సర్పంచ్ రాచప్ప, పంచాయతీ కార్యదర్శి పుట్టి శ్రావణ్‌కుమార్‌తో కలిసి ప్రజలకు పలు సూచనలు చేశారు. తడిగా ఉన్న విద్యుత్ స్తంభాలను తాకవద్దన్నారు. వర్షాల సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు.

'ఆధార్' శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు శిబిరాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ కామారెడ్డి శ్రావణ్ కుమార్ అన్నారు. రాజంపేట మండల కేంద్రంలో 2 రోజుల పాటు శిబిరం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆధార్ నమోదు, మార్పులు చేర్పులకు సంబంధించిన సేవలను ఈ శిబిరంలో అందించనున్నారు. ఎస్‌పీఎం భిక్షపతి, ఎంవో వెంకట్‌రెడ్డి, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.


బాన్సువాడ: కల్కి చెరువు అలుగు వద్ద చేపలు పడుతున్న యువకులు


తాడ్వాయి: బ్రాహ్మణపల్లిలో కోతకు గురైన తాత్కాలిక రోడ్డు


నాగిరెడ్డిపేట శివారులో తెగిపోయిన రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ సునీతారెడ్డి


భవానీపేటలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న అధికారులు

వర్షాలు మిగిల్చిన నష్టం

- నీట మునిగిన పంటలు
- కోతకు గురైన రోడ్లు


తిమ్మనగర్ వద్ద కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది


అలుగు పారుతున్న బీబీపేట పెద్ద చెరువు

సాక్షి నెట్‌వర్క్: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు జిల్లా అతలాకుతలమైంది. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించి పంట పొలాలను దెబ్బతీశాయి. చెరువులు పూర్తి స్థాయిలో నిండి మత్తడి దూకుతున్నాయి. వరద నీరు జాతీయ రహదారులపై ఉధృతంగా ప్రవహించడంతో రోడ్లు చాలా చోట్ల దెబ్బతిన్నాయి. వరద కారణంగా కొన్ని గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. పలు చోట్ల ఇళ్లు కూలాయి. బీర్కూర్ మండల కేంద్రంలోని బీర్కూర్–బాన్సువాడ ప్రధాన రహదారికి ఇరువైపులా కొత్తగా చేపడుతున్న ఇళ్లు, రేకుల షెడ్లు, వెంచర్ల కారణంగా వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఇటీవల నూతనంగా నిర్మించి ఓ ఇంటి యజమాని తన స్వార్థం కోసం నీటి ప్రవాహం వెళ్లే పైపును పూర్తిగా మూసివేయడంతో వర్షపు నీరు అధికమై పంటలు మునిగి చెరువును తలపిస్తున్నాయి. సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లిలో రైతు మార తిరుపతి రెడ్డి ఇటీవల వరి నాట్లు వేయగా.. వరద నీటికి ప్రవాహానికి పూర్తిగా కొట్టుకుపోయాయి. ఎల్లారెడ్డి మండలంలోని అడివిలింగాల శివారులోని పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. లింగంపేట మండల పరిధిలో కూలిన ఇళ్లను శుక్రవారం ఎల్లారెడ్డి ఆర్డీవో రమేశ్ రాథోడ్ పరిశీలించారు

వాగు వైపు వెళ్లకుండా ట్రాక్టర్ అడ్డు..

ఎల్లారెడ్డి: మండలంలోని కల్యాణి గ్రామ శివారులోని వాగు వైపు ఎవరూ వెళ్లకుండా గ్రామస్తులు గురువారం రాత్రి ట్రాక్టర్‌ను అడ్డుగా పెట్టారు. గురువారం నుంచి భారీ వర్షాలు కురవడంతో కల్యాణి వాగు పొంగిపొర్లుతోంది. దీంతో ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకున్నారు.


కల్యాణి గ్రామ శివారులో ట్రాక్టర్‌ను అడ్డుగా పెట్టిన గ్రామస్తులు

నీట మునిగిన పంటలు


తిర్మన్‌పల్లి శివారులో నీట మునిగిన వరి


అడివిలింగాల శివారు పొలాల్లో ఇసుక మేటలు


దోమకొండ: సీతారాంపల్లిలో కాలువకు గండి పడి పొలాల్లోకి వెళ్తున్న నీరు


బీర్కూర్‌లో జమిందార్ వాగు సమీపంలో..

మంజీర నీటిలో పంట పొలాలు


గోలిలింగాల శివారులో మునిగిన పంటలు


తాండూర్ శివారులో..

- సుమారు 700 ఎకరాల్లో పంట మునక
- ఆందోళన చెందుతున్న రైతులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): భారీవర్షాలకు నాగిరెడ్డిపేట మండలంలోని మంజీర పరివాహక ప్రాంతంలో వరిపంటలు నీటమునిగాయి. మెదక్ జిల్లా నుంచి వచ్చిన వరద నీటితో మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గోలిలింగాల, చీనూర్, వెంకంపల్లి, తాండూర్, మాటూర్, మాసాన్‌పల్లి తదితర గ్రామాల శివారులో సుమారు 700 ఎకరాల వరకు పంటలు నీటమునిగినట్లు ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. గురువారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ మంజీర పరివాహక ప్రాంతంలో పర్యటించి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాటు శుక్రవారం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆరుగేట్లను పైకి ఎత్తి వరదనీటిని దిగువకు విడుదల చేయించారు. వరదనీరు క్రమక్రమంగా వెనక్కి వెళ్తోంది.

పొలం మొత్తం మునిగింది



నేను తాండూర్ శివారులోని మంజీర పరివాహక ప్రాంతంలో మూడెకరాల పొలం కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేస్తున్నాను. మంజీర నదికి పోటెత్తిన వరద నీటితో నా పొలం మొత్తం మునిగిపోయింది. పొలం నీట మునగడంతో ఆందోళనగా ఉంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– ముగ్గపురం సిద్దిరాములు, బాధిత రైతు, తాండూర్

ఐదు రోజుల క్రితమే నాటేశాను



మంజీర పరివాహక ప్రాంతంలో ఉన్న మూడెకరాలలో ఐదురోజుల క్రితమే వరిపంట నాటేశాను. కాని రెండు రోజులుగా కురిసిన భారీవర్షాలతో మంజీరనదిలో భారీగా వరదనీరు వచ్చి నా పొలాన్ని ముంచేసింది. పొలంలోకి చేరిన నీరు వెంటనే వెళ్లిపోతేనే పంట దక్కేది. ఇప్పుడు ఆందోళనగా ఉంది.

– మునిగేపల్లి చిన్న సంగయ్య, బాధిత రైతు, తాండూర్


లింగంపేటలో కూలిన ఇల్లును పరిశీలిస్తున్న ఆర్డీవో రమేశ్ రాథోడ్


ఎల్లారెడ్డి: లింగారెడ్డిపేటలో..

పలు చోట్ల కూలిన ఇళ్లు


హన్మాజీపేట్‌లో ..


లింగంపల్లిలో ఇల్లును పరిశీలిస్తున్న ఎంపీడీవో రాణి


బిచ్కుంద: కూలిన ఎంఈవో కార్యాలయం గోడ


దోమకొండలో..

పాత ఇళ్ల కూల్చివేత


బోర్లంలో కూల్చివేయిస్తున్న ప్రజాప్రతినిధులు


పోచారం గ్రామంలో పాత ఇంటి యజమానికి నోటీసు ఇస్తున్న కార్యదర్శి సచిన్

బాన్సువాడ రూరల్: భారీ వర్షాలకు పాత ఇళ్లు కూలి పలుచోట్ల ప్రమాదాలు చోటుచేసుకోవడంతో మండల అధికారులు స్పందించారు. శుక్రవారం బోర్లం గ్రామంలో పంచాయితీ కార్యదర్శి సాయికుమార్ ఆధ్వర్యంలో శిథిలావస్థలో ఉన్న ఇంటి యజమానులను ఒప్పించి పలు ఇళ్లను కూల్చివేయించారు. అలాగే పోచారం లో పాత ఇళ్లను గుర్తించి వెంటనే వాటిని ఖాళీ చేయాలని సూచిస్తూ పంచాయితీ కార్యదర్శి సచిన్ నోటీసులు అందించారు. పాత ఇళ్లను కూల్చి వేయడానికి డబ్బుల్లేవని, ప్రభుత్వమే స్పందించి ఇళ్లపై కప్పుకునేందుకు తాటిపత్రిలను ఉచితంగా అందించాలని కోరుతున్నారు.

రోడ్డుపై వర్షపు నీరు తొలగింపు



కామారెడ్డి టౌన్: పట్టణంలోని 45వ వార్డులో రోడ్లపై నిలిచిపోయిన వర్షపు నీటిని తొలగించారు. సెప్టిక్ ట్యాంక్‌లు శుభ్రం చేసే ట్యాంకర్‌తో సుభాష్‌రోడ్, జేపీఎన్‌రోడ్, శివాజీ రోడ్లలో వర్షపు నీటిని పైప్‌ద్వారా తొలగించి పట్టణ శివారులో వదిలేశారు. స్థానిక వార్డు కౌన్సిలర్ పిట్ల వేణుగోపాల్ దగ్గరుండి పనులు చేయించారు.

కులవృత్తులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం

బీబీపేట: తెలంగాణలో కులవృత్తులను ప్రోత్సహించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జనగామలో రెండో విడత గొర్రెలను పంపిణీ చేశారు. గ్రామంలోని 12 మంది లబ్ధిదారులకు ఈ యూనిట్లను అందించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి సింహారావు, సర్పంచ్ పాత రాజు, ఏడీ సంజయ్, మండల పశు వైద్యాధికారి హేమశ్రీ, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.


గొర్రెలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సమాచారం..

రేపు బాన్సువాడలో ఉచిత వైద్య శిబిరం

బాన్సువాడ: పట్టణంలోని పాత బాన్సువాడలోని అంజిరెడ్డి కాంప్లెక్స్ వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అంజిరెడ్డి తెలిపారు. బాన్సువాడ లయన్స్ క్లబ్, మెడికవర్ ఆస్పత్రి(నిజామాబాద్) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు వారు చెప్పారు.

పీర్ల పండుగ ప్రారంభం

భిక్కనూరు: మండల కేంద్రంలో పీర్ల పండగ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ముస్లింలు బీపాత్మ, దూదిపీర్లను తయారుచేసి ఆచారం ప్రకారం ప్రతిష్ఠించారు. అనంతరం డప్పువాయిద్యాలతో మండల కేంద్రంలో ఊరేగించారు. అసైదులా ఆడుతూ పీర్లతో విన్యాసాలు చేశారు. పలువురు పీర్లకు కుడుకలు, బియ్యాన్ని నైవేద్యంగా సమర్పించారు.


భిక్కనూరులో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న స్థానికులు

సంక్షిప్తం

విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

మద్నూర్(జుక్కల్): వర్షాకాలంలో విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైద్యులు సూచించారు. పెద్ద ఎక్లార గేటు వద్ద గల తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో శుక్రవారం ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రిన్స్‌పాల్ సవిత, డాక్టర్ ఉమాదేవి, నాగార్జున, దస్తీరాం, సుధాకర్, జ్యోతి ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి సన్మానం

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట ఎస్సై శంకర్ బదిలీపై సిద్దిపేటకు వెళ్తున్న సందర్భంగా శుక్రవారం మండల సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సర్పంచులు ఘనంగా సన్మానించారు. ఫోరం మండల అధ్యక్షుడు బండి రాజయ్య, బీఆర్ఎస్ నేత దివిటి రమేశ్, తదితరులున్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

కామారెడ్డి టౌన్: కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే బట్కిరి కృష్ణ వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసినట్లు జిల్లా అధ్యక్షుడు సంజీవ్ తెలిపారు.

పీజేఆర్ కళాశాలలో హరితహారం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పీజేఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలను నాటి వాటికి నీరు పోశారు. కళాశాల చైర్మన్ గురువేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, హన్మంత్‌రావు, నరేష్ గౌడ్, రవి పాల్గొన్నారు.

సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీరేఖ చెక్ పవర్ పునరుద్ధరణ చేసినట్లు ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. 8 నెలల క్రితం లబ్ధిదారులకు పింఛన్ కార్డుల పంపిణీలో అత్యుత్సాహం ప్రదర్శించడంతో ఫిర్యాదు మేరకు అధికారులు సర్పంచ్ చెక్ పవర్ తొలగించారని తెలిపారు.

బాధితులకు టార్పాలిన్ల పంపిణీ

బీబీపేట: మండలంలోని 20 కుటుంబాలకు ఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు టార్పాలిన్ కవర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రవీందర్‌రెడ్డి, నీల స్వామి, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

రాజంపేట: శివాయిపల్లి ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని మౌలిక వసతుల గురించి తహసీల్దార్ శాంతను అడిగి తెలుసుకున్నారు.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలి

మద్నూర్(జుక్కల్): మద్నూర్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం యువకులు గ్రామ పంచాయతీలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మద్నూర్‌కు మంజూరైన కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు అసలు ఎంత వరకు వచ్చిందో మద్నూర్ ప్రజలకు ఎమ్మెల్యే హన్మంత్ సింధే సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

జాతీయ విద్యా విధాన దినోత్సవం

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం జాతీయ విద్యా విధానం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మనుయోహన్నన్, తహసీల్దార్ నారాయణ, వైద్యుడు రోహిత్ తదితరులున్నారు.